# ఉద్విగ్నసంగమం

ఆ తర్వాత ఆరేళ్ళ జీవితం గడిచింది. అయినా అప్పలస్వామికి ఆశ చావటం లేదు. 'అలా జరిగితే...మల్లి తిరిగివచ్చేస్తే' అన్న భావన ప్రతిరోజూ ఏదో రకంగా ఆ మనసులో ఏదో మూల కదులుతూనే వుంది. ప్రతి శుక్రవారం ఆ ఆశ మరింతై ... మురిపించి .... నిరాశ పరుస్తూనే వుంది.

గతంలోని ఏదో వో రోజు తాలుకూ చిన్న సరదా....లేదామల్లి వేళాకోళం.... మొండిగా. అమాయకమైన జాణలా తనక్కావల్సింది సాధించుకునే మల్లి చూపు యిలా అనేకానేక విషయాలు అప్పలసామి మనసుని పట్టుకుని వదలటం లేదు.

చూసే వాళ్ళందరికీ వాడి బతుకు బాగానే కనిపిస్తోంది. కావాల్సింది తింటున్నాడు ... డబ్బుకి లోటులేదు...ఎవరి బాధ్యత లేదు... కానీ యీ బతుకు వాడికే బావుండటంలేదు. అన్నీ వుండి, అసలు తనకి కావల్సిందేదో లేని శూన్యపు సుఖంలా వుంది.

'మల్లి కావాలి .... తనొచ్చేస్తే తిరిగి యీ బతుక్కి అన్నీ వచ్చేస్తాయి ...' అనీ వాడి ఆశ.

అయిదు నెలలేనా సరిగ్గా కాపరం చెయ్యని మల్లి ... 'నీలాంటి మగాడితో నాలాంటి ఆడది బతకటం కష్టం ...' అని ముఖం మీద చెప్పి ... 'మనిద్దరం యీ రోజు నుంచి మొగుడూ పెళ్ళాలం కాదు....' అని తమిద్దరి బంధాన్ని తెంపేసిన మల్లి వస్తుందని వాడిఆశ.

మల్లి వెళ్ళి ఆరేళ్ళయినా ఆ ఆశతీరలేదు అప్పలసామికి. యీ ఆరేళ్ళ అప్పలసామి బతుకులో మరో ఆడదిలేదు.

ఆరోగ్యమైన ఆ శరీరంలో కోరిక లేక కాదు ... అవకాశం లేకా కాదు .... మనసు, శరీరం కలిసి, చొరవగా ముందుకి నడిచే అనుస్పందన లేక ...

అప్పలసామి వుంటున్నది చిన్న పాక. నిద్రలేచి కన్ను తెరవగానే ఆ మగతలో చాలా సార్లు ఆ పాక చాలా పెద్దదిగా, తన వొంటరి బతుకు తట్టుకోలేనంత విశాలంగా కనిపించేది. అలా అనిపించిన రోజంతా దిగులుగానే వుండేవి. ఆ చిన్న యిరుకు పాకకి ఆడా, మగా అన్నీ అతనే.

గిన్నెలు తోముకోవటం దగ్గర్నించి వండు కోవడం వరకూ అన్ని పనులు అప్పలసామే చేసుకుంటాడు అలవాటై పోయింది. అయినా వొక్కోసారి బద్ధకంగా వుంటుంది. ఆ బద్ధకంలో అన్నీ పనులు విసుగ్గా వుంటాయి అప్పుడు మాత్రం ఏమిటీబతుకు ? ఎవరి కోసం ? .... అనిపిస్తుంది. మళ్ళీ కాసేపటికి ఏదో ఆలోచన .... వ్యాపారం వూహో ... యిచ్చిపుచ్చుకునే లావాదేవీలో గుర్తొస్తాయి.... తిరిగి మామూలే ... నిత్య బ్రతుకులో మునిగి పోయాడు.

అన్నీ వుండి ... ఏమిలేనట్టున్న ఆ జీవితంలో లోటు అప్పలసామికి తెలియంది కాదు. నిత్యం తను చేసే చాలా పనుల్లో ఆలోటుని

వి. రాజారామమోహనరావు



అప్పలసామి హృదయం చూస్తూనే వుంది. పెళ్ళాం లేదు పిల్లల్లేరు ... అటూ ఇటూ ఎవరూలేని అనాధ బతుకు .... అయినా జీవితం సాగుతూనే వుంది.

దిగులు పట్టం ... మళ్ళీ మామూలుగా మారడం తప్ప ....గాలిలోలేని, తేలికై అన్నీ మరచి పోయి ఆనందించే అనుభవం అప్పలసామి మనసు మరచిపోయి చాలా రోజులైంది.

అప్పలసామి బతుకులో ఏదైనా మార్పనేది వుంటే అది ఒక్క శుక్రవారం మాత్రమే. ఆ రోజు మంచి హడావిడిగా వుంటాడు .... మంచి ఆశగా వుంటాడు ... ఏదో జరుగుతుంది. జరిగే అవకాశం వుందని వుద్విగ్నంగా వుంటాడు.

భార్య తన జీవితంలోంచి వెళ్ళిపోయాక వ్యాపారరీత్యా, వ్యాపార ధోరణిలో జనంతో మాట్లాట్టమే తప్ప .... మనసు విప్పి ఎవరితోటి వుండలేదు. అప్పలసామి ఎవరితోనేనా కొంచెం చనువుగా వున్నా మాట్లాడినా చివరికి విషయం వెళ్ళిపోయిన భార్య మీదికి మళ్ళటం ఎదుటివాళ్ళు యితన్ని వోదార్చే ధోరణిలో మల్లిని తిట్టటం ... తక్కువగా, చులకనగా మాట్లాట్టం అప్పలసామికి బాధగా

వుంటూ వచ్చింది ... అందుకని అందరి నుంచీ, అన్నింటినుంచీ దూరంగా వుండటం అలవాటు చేసుకున్నాడు ... అతని మనసే అతని లోకం .... ఆ లోకంలోకి కొద్దిగా తొంగి చూసిన మనిషెవరేనా వుంటే అది లక్ష్మి మాత్రమే ...

లక్ష్మి వుండేది అప్పలసామి వుంటున్న పాకకి మూడు పాకల అవతల. ఒకరికి వొకరు చాలా ఏళ్ళగా తెలుసు.

మల్లితో కాపరం దగ్గర్నించీ....యిప్పటి అప్పలసామి జీవితంవరకూ లక్ష్మికి తెలుసు. అతన్ని వోదార్చాలని కాక, ఆడబతుకు బల హీనతల్ని లోతుగా తెలిసిన ఆడదానిగా మల్లి చేసిన పని గురించి తన మనసులో వున్న భావనని మృదువుగా చెప్పింది. అందరి మాట లకీ, చేతలకీ అలసిపోయిన అప్పలసామిని లక్ష్మి మాటలే వోదార్చాయి అనాడు.

ఆడదానికి తొందరపాటు తర్వాతే నిజంగా మంచి మనసున్న మగాడి విలువ తెలిసేది. "మల్లి ఎల్లిపోయిందని కష్టపెట్టుకోకు. తిరిగి వస్తుందనే అనుకుందాం...." అన్న లక్ష్మి ఆనాటి మాటలే అప్పటికీ యిప్పటికీ అప్పల సామికి ఆశ. దానికితోడు వోరోజు వోకోయ వాడు జోస్యంకూడా చెప్పాడు... 'నీ బతుకు లోంచి నీ ఆడది వెళ్ళిపోయింది ... దిగులు పడకు. మంచే జరుగుద్ది .... శుక్రవారం నాడు నీమహాలక్ష్మి నీకు దొరుకుద్ది...." అని అందుకే అప్పలసామికి పిచ్చి నమ్మకం ... ఏదో శుక్రవారం మల్లి తిరిగి వచ్చేస్తుందని. అందుకే శుక్రవారం ఆశగా వుంటాడు.


మల్లి వెళ్ళిన అప్పలసామి జీవితంలోకి లక్ష్మి తొంగి చూట్టానికి మరోకారణం వుంది. ఆ వీధిలోనేకాదు, యించు మించు ఆ వూళ్లోనే లక్ష్మిని మనిషిలా చూసే మగాడు అప్పలసామి ఒక్కడే. మిగిలిన వాళ్ళందరికీ వోదిగజా రిన వస్తువు లక్ష్మి.

వొళ్ళమ్ముకుంటూ పాకస్థాయికి దిగజారిన తనని అందరూ గౌరవించాలన్న పేరాశ లక్ష్మికి లేదు. కానీ ఎవరేనా తననీ వోమని షిగా, వోతోడుగా చూసి ఒక్కమాట మాట్లా డితే చాలన్న కోరికుంది. కారుచిచ్చులాంటి లక్ష్మి అంతరంగానికి అప్పలసామి అభి మానం చల్లటి వోదార్పు. ఎప్పుడేనా అత్యవ సరాల్లో అతని దగ్గర అయిదూ, పదీ అప్ప డిగి తీసుకునేంత దగ్గరతనం... "ఏంమావా అంత దిగులుగా ఉన్నావు. ఎల్లిపోయిన అక్కా రాత్రి కల్లోకొచ్చిందా ...." అని వేళా కోళంగా అతనిని సేదతీర్చే చనువు అప్పల సామి దగ్గర వున్నాయి లక్ష్మికి.

వారంలో మిగిలిన రోజులన్నీ ఒకర్ని మరొకరు కలుసుకోక పోయినా, ప్రతి శుక్ర వారం లక్ష్మి, అప్పలసామి వ్యాపారరీత్యా కలుసుకుంటారు.

సరస్వతీ టాకీసు దగ్గర మషాళా శెనగలు అమ్మటం అప్పలసామి చేసేపని. సాధార ణంగా శుక్రవారంనాడే కొత్త సినిమాలు రిలీజ్ అయ్యేది. ప్రతివారం సినిమా మారక పోయినా టాకీసు దగ్గర శుక్రవారంమాత్రం రష్ ఎక్కువే వుంటుంది. ఆవూరి సంతరోజు శుక్రవారమే. ఆరోజు సరుకు ఎక్కువ తీసు కొస్తాడు అప్పలసామి. తెచ్చిన సరుకంతా అయిపోని రోజులేదు. మధ్యాన్నం మేటినీ టైముకి పళ్ళెం నిండా వాలికి పోతాయా అన్నట్టు తెచ్చిన శెనగలు రెండోఆట యింట ర్వెల్‌కల్లా అయిపోతాయి. కొద్దోగొప్పో మిగిలితే చుట్టుపక్కల పిల్లలకి పంచేస్తాడు. లొట్టలేసుకుంటూ నవ్వుతూ పిల్లలు ఆ శెన గలు తింటున్నప్పుడల్లా తనకో పిల్లాడుంటే అనిపిస్తుంది అప్పలసామికి.

సినిమా రష్ బాగున్న శుక్రవారంనాడు పొరుగూరునుంచి గిరాకీలు తగులుతాయని సినిమాకి వస్తుంది లక్ష్మి.. ఆరోజు మామూలు కన్నా బాగా అలంకరించుకుంటుంది. ఎవరో పల్లెటూరి సరుకు అనుకునేటట్టు ప్రవర్తించి




గాలం వేస్తుంది. ఆ గాలానికి మంచి గిరా కీలే తగుల్తాయి.

రెండోఆట సమయానికి లక్ష్మి బిజినెస్ అయిపోతే ఆనాటి వ్యాపారం కబుర్లు చెప్పుకుంటూ యిద్దరూ కలిసి పాకలదాకా వస్తారు. అలా వచ్చేముందో, లేకపోతే తరవాతో యిద్దరి చూపులూ మాట్లాడుకుంటాయి. ఆ శుక్రవారం కూడా మల్లి రాలేదన్న చేదు నిజాన్ని ప్రసారంచేసే చూపులవి.

చేదుని మింగుతూ, తీపికోసం ఆశిస్తున్న అప్పలసామి ఎవరికీ సుఖం లేదనిపించే తన జీవితంలో కొన్ని అలవాట్లు చేసుకున్నాడు. ఆ అలవాట్లు పూర్తిగా అతని బతుకుని అర్థవంతంగా తీర్చిదిద్దకపోయినా కొంత తృప్తి నిస్తున్నాయి.

వాటిల్లోదే ఒకటి ప్రతి శుక్రవారం అతను చేసే దానం. ఆ రోజు మూడు రూపాయల చిల్లర చొక్కా జేబులో వేసుకుని బైలు దేరతాడు ఆ మూడు రూపాయలుఅయిపోయే వరకూ ప్రతి బిచ్చగాడికి దానంచేస్తాడు. ఎవరో పెద్ద సేట్స్‌లుగా ప్రతివారం అప్పలసామి చేసే ఆ దానం చూసే వాళ్ళందరికీ విచిత్రంగానే వుంటుంది. కానీ ఎవరికోసమో కాక తన బతుకు మరీ అంత నిరర్థకం కాదని అతనికి అతను చెప్పుకునే సంజాయిషీ ఆదానం.

అలాగే ... ప్రతి శుక్రవారం తప్పని సరిగా నాలుగు మూరల పూలదండ కొంటాడు అప్పలసామి. ఒకవేళ అకస్మాత్తుగా మల్లి కనిపిస్తే చూపులతో ఆర్ద్రంగా ... స్వాగతం చెప్పి ... అన్నాళ్ళ తన నిరీక్షణని, మనసుని ఆ పూల ద్వారా ఆమెకి తెలపాలని కోరిక - నిజంగా ఆ సమయమే వస్తే తబ్బిబ్బులో మాట పెగలదేమో నన్న భయం ...

రోజు రోజంతా ఎంతో అపురూపంగా దాచిన ఆ పూలని అర్థరాత్రి తిరిగి వెళ్ళే టప్పుడు నిరాశగా, నిస్పృహగా టాకీసు పక్కన పారే మురిక్కాలవలోకి వదిలే యటమే జరుగుతోంది.

మళ్ళీ సర్వం పోగొట్టుకున్న వాడిలా అప్పలస్వామి పూలని అలా పారెయ్యటం లక్ష్మి చాలా సార్లు చూసింది ... అలా చూసి నప్పుడల్లా గుండెల్ని తొలుస్తున్నట్టు బాధ లక్ష్మికి ... ఏం చెయ్యాలో....ఎలా అప్పలసామికి వుపశమనం చేకూర్చాలో తెలియని బాధ ....

బజారు ఆధారంగా వాళ్ళమ్ముకునే లక్ష్మికి పూలు వీటుడిని ఆకర్షించే హంగుల్లో ఒకటి. కానీ అవే పూలు అప్పలసామి ఆశకి, అమాయకమైన అతని ఆరాధనకి, మూగబాధకి, నిండైన నిర్మలమైన వో మగాడి మనసుకి ప్రతి రూపంలా కనిపించేవి...అటువంటివి తన కళ్ళెదుటగానేలపాలవుతుంటే జీవితంలో ఆ అనుభూతి కరువైన లక్ష్మికి గుండె తరుక్కు పోతున్నట్టుండేది.

అంతకీ అప్పలసామికి చెప్పి చూసింది. "ప్రతి శుక్రవారం అలా పూలు కొంటం ఎందుకు, బాధ పట్టం ఎందుకూ..." అని. అప్పలసామి లక్ష్మి మాటలు విన్నాడే తప్ప పూలు కొంటం మానలేదు.

* * *

మళ్ళీ మరో శుక్రవారం...

గతంలో లాగ వుత్సాహంగా వుండటం లేదు అప్పలసామికి కొద్ది రోజులుగా అతన్ని వో అపనమ్మకం బాధిస్తోంది. మల్లి వెళ్ళి యీ రోజుకి ఏడేళ్ళు అవుతాయి. ఏడేళ్ళు అతనికి వో హద్దులావుంది... "యింక మల్లి రాదు..." అన్న అపనమ్మకం ఆ హద్దు దగ్గరపడిన కొద్దీ యిబ్బంది పెడుతోంది.

తన అపనమ్మకాన్ని, బాధని లక్ష్మికి చెప్పాడు. మల్లి వస్తుందన్న నమ్మకం లక్ష్మికీ పోయింది. తిరిగి వచ్చే ఆడదైతే యీ పాటికి రావాలి. రాలేదంటే ఆమెవెతుక్కున్న జీవితం తృప్తిగానేనా వుండాలి... లేదా పూర్తిగా నాశనం అయిపోయి అప్పలసామి లాంటి మంచి మనిషికి తిరిగి ముఖం చూపించ కూడదన్న మొండి పట్టేనా అయ్యుండాలి.

అప్పలసామి మంచితనం మల్లికి తెలుసు. అతని పేరూ తెలుసు. కానీ ఒక్కటే బలహీనత. షోకులమీద మోజు, కల్లబొల్లి కబుర్లు చెప్పే మగాడి మాటలన్నా, పొగడ్తలన్నా పిచ్చి. అందుకే యివేవీ అప్పలసామి దగ్గర లభించవని తెలిసి వెళ్ళిపోయింది.

మల్లి యింక రాదేమో అన్న అనుమానం తనకీ వుందని అప్పలసామికి చెప్పాలనిపించ లేదు లక్ష్మికి. మల్లి రాదన్న నిజం అతను భరించలేడని తెలుసు. అబద్ధమే అయినా ఆ ఆశే అతనికి ఊపిరి. అలా అని పూర్తిగా అప్పలస్వామికి కల్లకబుర్లూ చెప్పలేక పోయింది. అందుకే "ఏడేళ్ళూ పూర్తి అవటానికి యింకా యీ రోజు మిగిలుందిగా... చూద్దాం" అంది. అప్పటికీ అప్పలసామి దిగులుగా వుంటే... "వూరికే అలా డీలా పడిపోకు యివాళంతా నీకూడా నేనూవుంటా సరేనా..." అని ధైర్యం చెప్పింది.


రోజుకన్నా ముందుగా యిద్దరూ టాకీసు దగ్గరికి చేరారు. తిరిగివస్తే మల్లి టాకీసు దగ్గరకే రావాలనేంలేదు. కానీ జనం మధ్యలో కనిపిస్తుందనీ, అప్పలసామి వుండేచోటు అది అని తెలుసు కాబట్టి వెతుక్కుని తిరిగి అక్కడికే వస్తుందని మనసు లోలోపల నమ్మకం.

గడుస్తున్న ప్రతి నిముషాన్ని ఆతృతగా వెతుకుతున్నారు లక్ష్మి, అప్పలసామి. యిద్దరికీ వ్యాపారంమీద, మిగిలిన మరేవిషయం మీద దృష్టిలేదు ఆరోజు. ఒకళ్ళిద్దర్ని చూసి మల్లేమో అని పొరబడ్డారు. గుండెలు బద్దలయ్యేంత ఆతృతగా వుంది. జీవన్మరణంలా వుంది గడుస్తున్న రోజు.

ఎండ తగ్గింది, చీకటి పడింది, వెన్నెలొచ్చింది ....వెతుకుతూనే వున్నాడు. మాటిమాటికి గుండెల్ని, మనసుని, మల్లెపూలదండని తడుముకుంటూ బిక్కు బిక్కుమంటూ చూస్తున్నాడు అప్పలసామి... అతన్ని అతనిలో జరుగుతున్న సంఘర్షణనీ చూస్తోంది లక్ష్మి.

రెండోఆట వదిలేశారు. అఖరి ఆశలా వెళ్ళే జనాన్ని పట్టిపట్టి పరీక్షగా చూశారు యిద్దరూ.

మల్లి వచ్చేస్తే బాపుణ్ణని పదే పదే భగవంతుడికి మనసులోనే దణ్ణాలెడుతోంది లక్ష్మి.




మంచి ముత్యం లాంటి అప్పలసామి మనసు చెదిరిపోకూడదని అన్ని దేవతలకి మొక్కు కుంటోంది. అన్ని దరిద్రాలు అనుభవించిన ఆ లక్ష్మి మనసు ...

అందరూ వెళ్ళిపోటం చూశాడు అప్పల స్వామి. అతని ఆశ అన్నాళ్ళ అతని ఆతృత కూడా తనలోంచి వెళ్ళిపోయినట్టు స్తబ్దుగా వుంది అప్పలసామికి. అంతా శూన్యమైపోయినట్టు, చేష్టలుడిగినట్టు కాసేపు అలాగే కూచున్నాడు. లక్ష్మికి ఏడుపొచ్చింది .... ఏడిస్తే ఏమిటో, ఏం మాట్లాడితే ఏమిటో అన్నట్టు గుండెలు బిగబట్టుకుని కూచుంది.

నెమ్మదిగా లేచాడు అప్పలసామి ... సామాను సర్దాడు. అన్నీ చూస్తున్న లక్ష్మికి మేన సముద్రంలా కనిపించాడు అప్పలసామి అతన్నే చూస్తోంది ...

బైలుదేరేముందు పూలపొట్లాన్ని చేతిలోకి తీసుకున్నాడు. అతని కళ్ళల్లో నీళ్ళువుబుకుతున్నాయి ... కసిగా చేతిని పైకి ఎత్తాడు. అర్థం లేని తన జీవితాన్ని విసిరేస్తున్నట్టు అడుగు ముందుకి వేశాడు ....

గాలిలా దూసుకుని ముందుకొచ్చింది లక్ష్మి. ముందుకి కదులుతున్న అప్పలసామిని అతని చేతిని పట్టుకుంది. అలా చెయ్యొద్దు అన్నీ పోగొట్టుకున్న శిలలా అలా బాధ పడుతున్న అభ్యర్థన లక్ష్మి కళ్ళని; కన్నీళ్ళని దాటింది.

లక్ష్మి చేతి స్పర్శలోంచి, కన్నీటిలోంచి కొత్త జీవితం లీలగా మెరుస్తూ లేత వెన్నెల్లా అప్పలసామిని తాకినట్టనిపించింది. యిద్దరి కళ్ళ నిండుగా నీళ్ళు.

అప్రయత్నంగానే అరుపైట .... అప్పలసామి, లక్ష్మి ఒకరి కౌగిలిలో మరొకరు మునిగిపోయారు. యిద్దరి కన్నీళ్ళు, బాధలు కలిసిపోయినట్టు కలిసి పోయారు...

మరికొన్ని క్షణాల, జీవితం తర్వాత .... యిద్దరూ తడి మెరిసే నవ్వుల్తో పాకవేపు బైల్దేరారు. అప్పలసామి మనసు అందించిన పూలు లక్ష్మి తన గుండెల దగ్గరగా పొదువుకుని వెన్నెల్లో వో అడుగు ముందు నడుస్తోంది. ఆమె వెనకే అడుగులో అడుగువేస్తూ అప్పలసామీ కదిలాడు...గతాన్ని దాటి ... యిద్దరూ సరికొత్తగా నడవగలమన్నట్టు వెన్నెల ప్రపంచంలోకి కదిలారు. •